# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



శనివారం 21 డిసెంబర్ 2024


### రాజంపేటలో

## విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ దాడులు

**13 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం**

**రాజంపేట అర్బన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త**

కడప విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి గీత వాణి ఆధ్వర్యంలో రాజంపేట పట్టణంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. మూడు హోటల్లలో అక్రమంగా వినియోగిస్తున్న 13 వంటగ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొని ఆ హోటల్లో యజమానులపై కేసులు నమోదు చేశారు. గృహాలలో సబ్సిడీతో వాడుకునే గ్యాస్ సిలిండర్లను తక్కువ ధరతో కొనుగోలు చేసి హోటల్లో వినియోగిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి నిర్వహించారు. హోటలలో కమర్షియల్ సిలిండర్లు వాడాలని, సబ్సిడీ సిలిండర్లు వాడడం నేరమని అధికారులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా వినకపోవడంతో విజిలెన్స్ దాడులు నిర్వహించి వంటగ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం దీపం 2 పథకం కింద సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు. ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పొందేవారు తమ వద్ద మిగిలి ఉన్న గ్యాస్ సిలిండర్లను వ్యాపారస్తులకు తక్కువ రేటుతో విక్రయిస్తున్నారు. రెండు విధానాలు తప్పే కానీ వ్యాపారస్తులు వినియోగిస్తుండగా పట్టుకుంటేనే కేసు నమోదు చేయవచ్చు. పాత బస్సు స్టాండ్ లోని ఒక హోటల్ నుంచి నాలుగు సిలిండర్లు రోడ్డు భవనాలు అతిథి గృహం సమీపంలోని ఒక హోటల్ నుంచి 5, మరో హోటల్ నుంచి నాలుగు సిలిండర్ లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సమాచారం.

## అరటిపండ్ల అలంకరణలో ఆంజినేయస్వామి

**మదనపల్లె, డిసెంబర్ 20 ప్రభాతవార్త :**



పట్టణంలోని వరాలస్వామి ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం అర్చకులు స్వామివారిని అరటిపండ్ల అలంకరణచేశారు. భక్తులకు ఆంజినేయస్వామి అరటిపండ్ల అలంకరణలో దర్శనం ఇచ్చారు. ధనుర్మాసం సందర్భంగా రోజూ వరాల ఆంజినేయస్వామి ఆలయంలో విశేషంగా పూజలు జరుపుతున్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. ఆలయ నిర్వాహకులు ఆలయానికి విచ్చేసే భక్తులకు స్వామి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు.

# ఆర్అండ్బీ స్థలంలో రేకుల షెడ్లు తొలగింపు

**- అక్రమ నిర్మాణాలు నేలమట్టం - దూకుడు పెంచిన రెవెన్యూ, పోలీసు అధికారులు**





**గాలివీడు, డిసెంబర్ 20(ప్రభాతవార్త):**

ఆర్అండ్బీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు, నిర్మాణాలను నేలమట్టం చేసి అధికారులు దూకుడు పెంచారు. అక్రమార్కుల గుండెల్లో రైళ్ల పరిగెత్తించిన అధికారులు ఉక్కుపాదం మోపుతూ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. వివరాలలోకి వెళితే.. గాలివీడు మండల కేంద్రంలోని గేటు నాలుగు రోడ్ల కూడలిలో సర్వే నెంబర్ 2266లో ఉన్న 1.80 ఎకరాలు భూమిలో ఆక్రమణ నిర్మాణాలు, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే తరునంలో స్థానికుల ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్, ఆర్డీఓ ఆదేశాల మేరకు కదిలిన స్థానిక రెవెన్యూ యంత్రాంగం, ఆర్ అండ్ బీ అధికారుల ఫిర్యాదు మేరకు 11 మంది ఆక్రమణ దారులకు తాఖీదులు అందజేశారు. 15 రోజులు గడువు ఇచ్చిన అనంతరం సిక్స్ నోటీస్ ఇచ్చిన అధికారులు పోలీసుల సహకారంతో శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలను జేసీబీ యంత్రాలతో తొలగించారు. అయితే స్థానికులు కొందరు తమ నిర్మాణాలు తొలగించాలంటే ఎదురుగా ఉన్న మరికొన్ని అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఎదురుతిరిగారు. దీంతో తహసీల్దార్ భాగ్యలత, ఎస్ఐ రామ కృష్ణ సమన్వయంతో చాకచక్యంగా వ్యవహరిస్తూ ఆక్రమణలను తొలగించారు. చివరగా మహాత్మాగాంధీ విగ్రహం చుట్టూ చికెన్ సెంటర్ల తొలగింపు, అక్రమ నిర్మాణాల తొలగింపుకు ససంఘీభావంగా స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అక్కడే ఉన్న గాంధీ మహాత్ముడి విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణదారుల నుండి కాపాడిన రెవెన్యూ, పోలీసు అధికారుల తీరుపై ప్రజలు ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. అక్రమ నిర్మాణాల తొలగింపులో ఉద్రిక్తతః గత 30 సంవత్సరాలుగా ఆర్ అండ్ బీ స్థలంలో రేకుల షెడ్లు నిర్మించుకుని వ్యాపారాలు, నివాసాలు ఉన్న వారికి రేకుల షెడ్లు తొలగించాలని గత రెడు మాసాలుగా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. వీటిని ఖాతరు చేయకపోవడంతో రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో ఆక్రమణ నిర్మాణాలను తొలగించడానికి జేసీబీ యంత్రాలతో ప్రయత్నం చేయగా, అక్రమ నిర్మాణదారులు తమ నివాసాలను తొలగించవద్దంటూ అడ్డుకున్నారు. స్థానికుడు ఒకరు రేకుల షెడ్ల పైకి ఎక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానంటూ పోలీసులను బెదిరిస్తూ హాల్చల్ చేశాడు. దీంతో పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ అతన్ని క్రిందకు దించి మందలించి పంపించి వేశారు.

### ప్రణాళిక బద్ధంగా ఇండ్ల నిర్మాణంలో

# ప్రగతి సాధించాలి

**ప్రతి వారం సమావేశం నిర్వహించి సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు తీసుకోవాలి**

**వ్యక్తిగత మరుగుదొడ్ల జియో టాకింగ్ వందశాతం పూర్తి చేయాలి**

**విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**

**జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి**

**రాయచోటి డిసెంబరు 20ప్రభాతవార్త**



జిల్లాలో ప్రణాళిక బద్ధంగా ఇండ్ల నిర్మాణంలో ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత మండల స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుండి జిల్లాలో ఇండ్ల నిర్మాణ ప్రగతి, 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, వ్యక్తిగత మరుగుదొడ్ల జియో టాగింగ్ అంశాలలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ డిఈ, ఏఈ, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిఆర్డిఏ ఏపీఎం, డ్వామా ఏపిఓ, పంచాయతీ సెక్రెటరీ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఒక గూడు కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇప్పటికే ఇండ్లు మంజూరై వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలి. వారం వారం స్టేజివారీగా ఇండ్ల నిర్మాణంలో తప్పనిసరిగా ప్రగతి సాధించాలి. విధుల పట్ల బాధ్యతారహితంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా మండల వారీగా ఆయా స్టేజిలలో పెండింగ్లో ఉన్న ఇండ్లు ఎన్ని, వాటిని ఏ విధంగా పూర్తి చేస్తారు ఇందుకు రూపొందించుకున్న కార్యాచరణ ప్రణాళిక ఏమిటి, ఇందులో వారం, పక్షం, మాసవారీగా ఏ విధంగా లక్ష్యాన్ని పూర్తి చేస్తారన్న వివరాలను ఎంపీడీవో హౌసింగ్ మండల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లను సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ప్రతి బుధవారం హౌసింగ్ ఏఈ మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏపీవో, ఏపీఎం, పంచాయితీ సెక్రటరీలతో... స్టేజి వారి గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎంపీడీవో సమావేశం నిర్వహించి గృహ నిర్మాణంలో ప్రగతి సాధించాలన్నారు. అలాగే ఎంతమందికి రుణాలు అవసరము, మొదటి రుణం ఎంతమంది పొందారు, రెండవ రుణానికి ఎంత మందికి అర్హత ఉంది, ఎంతమందికి రుణాలు మంజూరు చేశారన్న వివరాలను సమర్పించాలని సూచించారు. ప్రతి శనివారం వారి పరిధిలోని ఒక లేఅవుట్ ను తప్పనిసరిగా సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీరో శాతం ప్రగతి ఉన్న సచివాలయాల కార్యదర్శులతో సమీక్షించి కారణాలు అడిగి తెలుసుకుని, తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక పటిష్టంగా అమలు చేయాలన్నారు. హౌసింగ్, డిఆర్డిఏ డ్వామా శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తే గృహ నిర్మాణంలో ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ఇక్కడ సమన్వయం కొరవడరాదని, ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. వచ్చేవారం మరలా సమీక్షిస్తామని, అప్పటికి స్టేజి వారి ప్రగతి సాధించని వారిపై తప్పనిసరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్, డిఆర్డిఏ పీడీలు శివయ్య, సత్యనారాయణ, జిఎస్డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ డిఈ,ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏపిఎం, ఏపీవో, పంచాయతీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

# కలపపై గొడ్డలి వేటు పెంచేదొకరు విక్రయించేది ఇంకొకరు





**రైల్వే కోడూరు అర్బన్ డిసెంబర్ 20,ప్రభాత వార్త**

ఏళ్ల తరబడి పెంచిన పర్యావరణ కలపపై గొడ్డలి వేటు పడుతుంది. ఒక శాఖ అధికారులు వాటిని ఏళ్ల తరబడి పెంచితే మరో శాఖ అధికారులు సమాచారం లేకుండానే కలపను విక్రయిస్తున్నారు. వీటిని రక్షించాల్సిన సంబంధిత శాఖ అధికారులు దగ్గరుండి మరి నరికేయిస్తున్నారు అంటే ఇంతకంటే దాస్టికం ఇంకెక్కడ ఉండదు. ఏళ్ల తరబడి పెంచిన అత్యంత విలువచేసే కల్పను కేవలం కాసిన్ని కాసులు కోసం మాత్రమే కాపాడాల్సిన వారు దగ్గరుండి నరికేయించడం దారుణం. ఇది ఎక్కడో కాదు కడప చెన్నై ప్రధాన రహదారి రోడ్డుకు పక్కనే ఉన్న ఆర్అండ్బి శాఖ వారు నాటిన మొక్కలు నేడు మాకులైపోయాయి. దశాబ్దాల కాలం నాటి పెద్దపెద్ద వృక్షాలను కల్ప వ్యాపారం చేసే కొంతమంది అక్రమార్కులు సంబంధిత అధికారులతో సంబంధం లేకుండా అటవీశాఖ అధికారులతో చేతులు కలిపి లక్షలు విలువ చేసే కలపకు వేల రూపాయలు ముట్టజెప్పి పట్టపగలే నరికి తరలించి విక్రయిస్తున్నారు. దీంతో ఆర్ అండ్ బి శాఖకు అత్యంత నష్టం కలిగితే పర్యావరణ పరిరక్షణ అనే నినాదాలతో ఊర్లు మొదలుకుని అటవీ ప్రాంతాల వరకు చెట్లను రక్షించి కాపాడాల్సిన అటవీ శాఖ అధికారులే కలప అక్రమార్కులకు అండగా నిలిచి అక్రమ కలపను తరలించేందుకు సహకరిస్తున్నట్లు తెలుస్తుంది. వీరి ద్వారా అక్రమార్కులకు వెళ్లే కలప నుంచి కనీసం ప్రభుత్వానికి చలానా రూపంలోనైనా సొమ్మును చెల్లిస్తున్నారంటే ఏ మాత్రమూ లేదు. లక్షలు విలువచేసే రోడ్ల పక్కన ఉన్న ప్రభుత్వ కలపను వేల రూపాయలు తీసుకుని అక్రమార్కులకు అండగా నిలిచి విక్రయిస్తున్న అటవీ శాఖలోని కొంతమంది అవినీతి అధికారుల బాగోతం గత కొన్ని నెలలుగా సాగుతూనే ఉంది. కలపనుతరలించే అక్రమార్కులను ఏ అధికారులైనా ప్రశ్నిస్తే అటవీ శాఖ అధికారికి ట్రాక్టర్కు 10000, లారీ లోడుకు 25 వేల చొప్పున చెల్లించి తరలిస్తున్నామని అడ్డుకున్న రెవెన్యూ సిబ్బందికే చెప్పడం విశేషం. ఈ విషయమై నేషనల్ హైవే అధికారులను ప్రశ్నిస్తే ఫోర్ లైన్ కోసం రోడ్డు పక్కన ఉన్న చెట్లను వెలకట్టమని అటవీ శాఖ అధికారులకు లెటరు పంపినట్లు తెలిపారు. ఆర్ అండ్ బి డిఈ జయప్రకాష్ ను వివరణ కోరగా రోడ్డు పక్కన ఉన్న చెట్లు ఆర్ అండ్ బి కి సంబంధం అని బ్రతికి ఉన్న చెట్లను ఎవరు నరకరాదని ఏదైనా చెట్ల వలన రోడ్డు పక్కన నివాసాలు ఉన్న ప్రజలకు ప్రమాదం పొంచి ఉంటే అలాంటి చెట్లను కూడా తమ శాఖ అనుమతితో తొలగించడం జరుగుతుందని ఫారెస్ట్ అధికారులు రోడ్లపై ఉన్న చెట్లను తమ అనుమతి లేకుండా నరికేయించడం సరైనది కాదని ఈ కలప ప్రభుత్వ ఆస్తి అని ఏదైనా ప్రభుత్వపరంగా ప్రజలకు ఉపయోగపడేందుకు వాడుకుని వాటిని టెండర్లు ద్వారా విక్రయించడం జరుగుతుందని దీనిపై సంబంధిత పై స్థాయి అధికారులకుఫిర్యాదు చేస్తామని కూడా తెలిపారు. ఈ విషయమై కోడూరు రేంజర్ శ్యామ సుందర్ ను వివరణ కోరగా అక్రమ దారులు నరికి తీసుకెళ్లిన కలప పట్ల కింద ఉన్న మొదలును కొలతలు తీసి వారిపై చర్యలు తీసుకుంటామని అక్రమంగా తరలించిన కలపకు అటవీ శాఖ అధికారులకు సంబంధం లేదని ఎలాంటి చలానాలు కూడా చెల్లించలేదని వాటి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మందుల బాబుల వీరంగం

**:రాళ్లతో, కత్తులతో ఒకరిపై ఒకరు దాడి**

**బద్వేలు, డిసెంబర్ 20,ప్రభాతవార్త :**



పట్టణంలోని మైదుకూరు రోడ్డులోని మద్యంషాపు వద్ద మందుబాబులు వీరంగం సృష్టించారు. మద్యంషాపులో మద్యం సేవించి మాటామాటా పెరగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అందరూ చూస్తుండగానే ఒకరిపై కత్తులతో, రాళ్లతో దాడిచేసుకున్నారు. మద్యంషాపులో మద్యం విచ్చలవిడిగా తాగించడం వలన గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పలువురు గొడవ పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి.దాడి చేసినట్లు సమాచారం. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స కోసం కడప రిమ్స్ కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మద్యంషాపు వద్దకు చేరుకుని వైన్షాపుల్లో మద్యం సేవించరాదని, నేటినుంచి మద్యం తాపినట్లు తెలిస్తే చర్యలు తప్పవని సీఐ రాజగోపాల్ హెచ్చరించారు.

## ప్రమాదాల నిలయాలు.. జాతీయ రహదారులు

**- గుంతలతో గుల్లవుతున్న వాహనాలు - ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**

**ఓబులవారిపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త:**

కడప-చెన్నై రహదారి ప్రమాదాలకు నిలయాలుగా మారాయని ప్రయాణికులు అటు వాహనదారులు డ్రైవర్లు వాపోతున్నారు. జాతీయ రహదారిలో ప్రయాణించాలంటే నరకయాతనగా ఉందని డ్రైవర్లు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగంపేట ఓబులవారిపల్లి, పుల్లంపేట, బాలుపల్లి తదితర గ్రామాల్లో మోకాళ్ల లోతు పూజలు లాగా గుంతలు పడి వాహనాల్లో గుల్ల అవుతున్నాయని వాపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు రాత్రివేళల్లో ప్రయాణించి కింద పడి తీవ్ర గాయాలైన సంఘటనలు కోకొల్లలు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు చొరవ చూపి జాతీయ రహదారికి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.



## జోరుగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణా

**చూసి చూడనట్లు జిల్లా యంత్రాంగం మండల స్థాయిలో పట్టి పట్టినట్లు పోలీసు, రెవిన్యూ**

**రాయచోటి డిసెంబర్ 20 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లా రాయచోటి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని చెప్పడంతో ఎక్కడ చూసినా మండల స్థాయిలో ట్రాక్టర్ యజమానులు ఇసుకను రాయచోటి తదితర ప్రాంతాలకు తరలిస్తూ జోబులు నింపుకుంటున్నారని ఆయా ప్రాంతాల్లోని రైతులు వాపోతున్నారు. ఇసుక అగ్రవాణా చేయడం వలన భూగర్భజరాలు అడుగంటి పోవడంతో సమీప ప్రాంతంలోని ప్రజలకు రైతులకు సాగునీటితో పాటు త్రాగునీటి కూడా అవస్థలు తప్పడం లేదని వారు వాబోతున్నారు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా తమ ప్రాంతాల్లోని నివాసాలకు అభివృద్ధి పనులకు మాత్రమే తరలించుకోవచ్చని చెప్పుడతో సొంత పనులకు కాకుండా సమీపంలోని నదీ పరివాహ ప్రాంతంలోని ఇసుకను తోడుకొని రాయచోటలో ట్రాక్టర్ ఇసుకను 3000 కోరిక ఇంచుకుంటూ సమూచేసుకొని జోగులు నింపుకుంటున్నారని పలువురు చెబుతున్నారు. ఈ తంతు ఇలాగే కొనసాగినట్లయితే గ్రామీణ ప్రాంతాలలో త్రాగడానికి నీళ్లు ఉండవని పలువురు వాపోతున్నారు. ఇసుక అక్రమ రవాణా ఎక్కువగా వీరబల్లి మట్లి రాగిమానుదిన్నపల్లి పుల్లగూర గండి వంగిమల్ల తదితర ప్రాంతాల నుండి తరలించడం జరుగుతుంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు చొరవ తీసుకొని ఇసుక అక్రమ రవాణా ఆపినట్లైతే గ్రామీణ ప్రాంతాలలో తాగునీటితోపాటు కాస్త కూర్చో సాగునీటికి కూడా నీరు ఉంటాయని లేనట్లయితే భూగర్భ జలాలు అడుగంటి పోతాయని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిఅధికారులకు వివరణ కోరగా ఇసుక ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని యంత్రాలతో కాకుండా కూలీలతో తీసుకువెళ్లచ్చని వారు చెబుతున్నారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో కాకుండా పగలు మాత్రమే తీసుకు వెళ్ళచ్చని అంటున్నారు కానీ ఇతర ప్రాంతాలకు తరలించే ఇసుక విషయమై ప్రశ్నించగా అది తమకు తెలియదని సమాధానం ఇస్తున్నారు.



## సంక్రాంతికి సిద్ధం అవుతున్న కాటమరాజు ఆలయం

**రామసముద్రం, డిసెంబర్ 20 ప్రభాతవార్త :**



రామసముద్రం మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయితీ మిట్టపల్లి గ్రామంలో వెలసిన కాటమరాజు ఆలయాన్ని గ్రామస్థులు శుక్రవారం ముస్తాబు చేశారు. సంక్రాంతి పండుగ సమీపించడంతో గ్రామాల్లో ఏడాదిగా ఆలయం పరిసర ప్రాంతాలు పి చ్చి మొక్కలు, గడ్డిపోచలు మొలిచి అపరిశుభ్రంగా ఉన్న ఆలయాన్ని జేసిబి సాయంతో పరిశుభ్రం చేసి, చుట్టుపక్కల ప్రాంతాన్ని ముస్తాబు చేశారు.

### కొనసాగుతున్న వివేకా

# పిఏ ప్రైవేట్ కేసు విచారణ

**ఎంపీ అవినాష్ బాబాయి వైఎస్ మనోహర్ రెడ్డి, జడ్పీటీసీ రవి**

**పులివెందుల, డిసెంబరు 20, ప్రభాతవార్త :**



మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్యకేసుకి సంబంధించి ఆయన పీఏ వెంకట కృష్ణారెడ్డి దాఖలు చేసిన ప్రయివేట్ కేసుపై పోలీసుల విచారణ గత కొన్ని రోజులుగా కొనసాగుతోంది. శుక్రవారం కడప పార్లమెంట్ సభ్యుడు వైయస్ అవినాష్ రెడ్డి బాబాయ్ పులివెందుల మున్సిపల్ వైస్ చైర్మన్ వైయస్ మనోహర్ రెడ్డి, వేంపల్లి జడ్పిటిసి సభ్యుడు రవికుమార్ రెడ్డి లను స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డిఎస్పి మురళి నాయక్ విచారించారు. వైఎస్ వివేకా హత్య కేసులో గత సిబిఐ అధికారి రామ్ సింగ్, వివేకా కూతురు సునీత, అల్లుడు రాజశేఖర్ రెడ్డి లు బెదిరిస్తున్నారని పులివెందుల కోర్టులో కృష్ణారెడ్డి ఫిర్యాదు చేయడంతో, కోర్టు ఆదేశాల మేరకు గత ఏడాది డిసెంబర్ 15 తేదీ న మాజీమంత్రి వైయస్ వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్ రెడ్డి, సీబీఐ ఎస్పీ రాంసింగ్ ల పై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి వారిపై ఛార్జ్ షీట్ కూడా పోలీసులు కోర్టులో దాఖలు చేసిన సంగతి తెలిసిందే. కానీ గత ప్రభుత్వంలో అధికార ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు ఈ కేసు పై సరైన విచారణ చేయకుండా చార్జిషీట్ దాఖలు చేశారని అప్పట్లో ఆరోపణలు పెద్ద ఎత్తున వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కేసు పై పూర్తి విచారణ చేయాలని ప్రస్తుత ప్రభుత్వం పోలీసులను ఆదేశించడంతో పోలీసులు మళ్లీ దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసుకు సంబంధించి సాక్షులకు సీఆర్పీసీ 160 కింద పులివెందుల డిఎస్పి మురళి నాయక్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. లాయర్ ఓబుల్ రెడ్డి, భరత్ కుమార్ యాదవ్ , రఘునాథరెడ్డి , ఇ సీ సురేంద్రనాథ్ రెడ్డి , మూలి రాజేష్ కుమార్ రెడ్డి, ప్రభావతమ్మ, వీఆర్వో మహేశ్వర్ రెడ్డి , జనార్దన్ రెడ్డి, భయపరెడ్డి లను పోలీసులు ఇదివరకే విచారించడం జరిగింది. ఇందులో భాగంగానే వైయస్ మనోహర్ రెడ్డి, వేంపల్లి జడ్పిటిసి సభ్యుడు రవికుమార్ రెడ్డి లు శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరు అయ్యారు.వీరిని న్యాయవాది సమక్షంలో పోలీసులు విచారించి వారు ఇచ్చిన వాంగ్మూలాన్ని వీడియో, ఆడియో రికార్డు చేసినట్లు డిఎస్పి తెలిపారు.

## సహాయ నిధి చెక్కులు పంపిణీ

పీలేరు డిసెంబర్ 20 ప్రభాతవార్త ః



నియోజవర్గ పరిధిలో ప్రమాదాలు, అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం పొందుతున్న 12 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అందజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పేషీ నుండి మంజూరైన నిధుల చెక్కులను శుక్రవారం కలికిరిలోని తన నివాసంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నియోజవర్గ స్థాయిలో టిడిపి కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులు 100 రూపాయలు సభ్యత్వం చెల్లిస్తే ఏ లాంటి ప్రమాదాలు జరిగినా చంద్రన్న బీమా వర్తిస్తుందని తెలియజేశారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో 76,90,000 మంది సభ్యత్వం పొందారని, దేశంలోనే ఏ పార్టీకి లేనంత బలం తెలుగుదేశం పార్టీకి ఉన్నట్లు సభ్యత్వాలతోనే రుజువైందని ఆయన కార్యకర్తలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు కు చెందిన పలువురు టిడిపి నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



పీలేరు,డిసెంబరు 20 ప్రభాతవార్త:

గ్రామ రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నిస్తున్నామని రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని బాలంవారిపల్లె గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మొత్తం 50 అర్జీలు వచ్చాయని 45రోజులు గడువులోపు ప్రతి అర్జీ పరిష్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమా, నోడల్ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, తహశీల్దారు భీమేశ్వరరావు సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వో నారాయణ, అధిక సంఖ్యలో రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల తనిఖీ

సుండుపల్లి, డిసెంబర్ 20, ప్రభాతవార్త:



సుండుపల్లి మండల కేంద్రానికి అతి సమీపంలో గాండ్లపల్లి ప్రాంతంలో గురుకుల పాఠశాలను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి వెంకటేష్ నాయక్ తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, విద్య విధానాలు, పౌష్టికాహారం మధ్యాహ్న భోజనం ప్రభుత్వ మెనూ ప్రకారం ఉందో లేదో అని పరిశీలించారు, ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు గొప్ప వరం

- లబ్ధిదారులకు రూ.11,16,851 చెక్కులు పంపిణీ
- ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి



ఓబులవారిపల్లె, డిసెంబరు 20, ప్రభాతవార్త:

ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంటుందని సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు సంక్షేమం, అభివృద్ధిని ఏక కాలంలో సాధిస్తున్నారని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మీలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందించడం ఓ వరమన్నారు. శుక్రవారం వారు రూ.11,16,851 రూపాయల చెక్కులను ఆరు మంది బాధితులకు అందజేశారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు వర్తించేలా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షాన ఉంటుందన్నారు.

**సీఎం సహాయ నిధి తీసుకున్న వారి వివరాలు..**

కందినతి లక్ష్మీకి రూ.65,395, రముదుర్తి సుబ్బరామరాజుకు రూ.95,837, తులసీగారి అశోక్‌కుమార్ రూ.46,800, భీమిశెట్టి బలరామయ్య రూ.4,16,250, ఒబినేని ప్రగతి యాదవ్‌కు రూ.3లక్షలు, ఆవుల పద్మావతికి రూ.1,92,569 మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ చెక్కులను ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు, ప్రజలు పాల్గొన్నారు.

## భీమా ప్రీమియం చెల్లింపు గడువు పెంపు

పులివెందుల రూరల్, డిసెంబరు 20, ప్రభాతవార్త :

రైతులు రబీ సీజన్ లో సాగు చేసిన పంటలకు సంబంధించి పంటల భీమా ప్రీమియం చెల్లింపును ఈ నెల 31 వ తేది వరకు పెంచినట్లు వ్యవసాయ అధికారి నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటల భీమా ప్రీమియం చెల్లింపు గడువు ఈ నెల15 వ తేదికి ముగిసిందని, రైతులు పంటల భీమా చెల్లించడంలో ఆన్లైన్ నందు ఇబ్బందులు ఏర్పడటం వలన భీమా కట్టలేక పోతున్నాము అని రైతులు అధికారులకు పిర్యాదులు చేయడంతో ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు దృష్టికి తీసుకెళ్ళడంతో ప్రీమియం చెల్లింపు గడువును ఈ నెల 31 కి పెంచడం జరిగింది అని తెలిపారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రూ.5లక్షలు సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

మదనపల్లె, డిసెంబర్ 20 ప్రభాతవార్త :

పట్టణంలోని నూర్‌జహాన్ కుటుంబీకులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద శుక్రవారం ఎమ్మెల్యే తనయుడు జునైద్‌అక్బరిలు రూ.5లక్షలు చెక్కు పంపిణీ చేశారు. నూర్‌జహాన్ కుమారుని బావాజాన్‌కు లివర్ మార్పిడి చికిత్సకు సంబంధించి బెంగుళూరులోని ప్రైవేటు ఆసుపత్రులో రూ.10లక్షలు ఖర్చు కాగా ప్రభుత్వ సహాయం నిమిత్తం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కోరగా ఆయన స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి కింది నిధులు మంజూరు చేశారు. ఆయన తనయుడు, తెలుగుదేశం పార్టీ యువనాయకులు ఈ చెక్కున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నాయకులు బెల్లె రెడ్డిప్రసాద్, ద్యాన్స్ రెడ్డప్ప, బాలు,పూలకుంట్ల రవి తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సంక్షేమమే టీజేఎఫ్



ప్రొద్దుటూరు, డిసెంబర్ 20 ప్రభాత వార్త :

జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా టీజేఎఫ్ పనిచేస్తుందని టీజేఎఫ్ జిల్లా కన్వీనర్ శ్రీకాంత్ అన్నారు. ప్రొద్దుటూరు టీజేఎఫ్ కమిటీ ఎన్నిక సమావేశం ప్రొద్దుటూరు పట్టణం అనిబిసెంట్ మున్సిపల్ హై స్కూల్ ఆవరణలో ఉన్న మహిళా స్వశక్తి భవన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులు పడుతున్న అనేక ఇబ్బందులను వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని టీజేఎఫ్ రాష్ట్ర కమిటీ పని చేస్తుందని చెప్పారు.

## టీజేఎఫ్ ప్రొద్దుటూరు కమిటీ ఎన్నిక...

ఈ సందర్భంగా టీజేఎఫ్ ప్రొద్దుటూరు కమిటీని జిల్లా కమిటీ సభ్యులు ప్రకటించారు. టీజేఎఫ్ ప్రొద్దుటూరు నియోజకవర్గ గౌరవాధ్యక్షులుగా రజాక్, ప్రొద్దుటూరు నియోజవర్గ అధ్యక్షులుగా పస్యావుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్, ట్రెజరర్‌గా పవన్ , ఉపాధ్యక్షులుగా అనిల్, సుబ్బయ్య, నాగరాజు, మొగిలి చంద్ర, సహాయ కార్యదర్శులుగా మహేష్, రాజు, భాస్కర్‌రెడ్డి, రాజుపాలెం నాగరాజులను ప్రకటించారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు.

## రైతులకు నష్టపరిహారం అందించాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి డిమాండ్**



మదనపల్లె, డిసెంబర్ 20 ప్రభాతవార్త :

జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధాన పైపులైన్ ప్రాజెక్టు నిర్వాహిసితులకు భూ నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఈ కాలువ నిర్మాణాలకు భూములు కోల్పోయిన ప్రాంతాలను రైతులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులు అనుసంధానం చేస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం గురించి పట్టించుకోవడం లేదన్నారు. భూ సేకరణ చట్టప్రకారం పరిహారం ఇచ్చి పనులు చేపట్టాలన్నారు. గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు రోడ్డున పడ్డారన్నారు. నోటిమాటలతో భూములు స్వాధీనం చేసుకొని పరిహారం చెల్లించడంలో అన్యాయం చేశారన్నారు. రైతులకు త్వరగా పరిహారం చెల్లించకపోతే ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, రైతులు శంకర, మహదేవ, క్రిష్టారెడ్డి, ప్రతాప్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు

**తహశీల్దార్ దనంజనేయులు**



నిమ్మనపల్లె, డిసెంబర్ 20 ప్రభాతవార్త :

ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ దనంజనేయులు అన్నారు. శుక్రవారం తవళం పంచాయితీలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భారీ సంఖ్యలో తమ అర్జీలను ప్రజావేదిక దృష్టికి గ్రామస్థులు తెచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బాలక్రిష్ణారెడ్డి, ఈఓఆర్‌డి చలపతిరావు, సీనియర్ అసిస్టెంట్ రెడ్డి ప్రసాద్, ఆర్ఐ అనంతలక్ష్మి, సర్వేయర్లు గోపి, మహేష్, ఇంతియాజ్, గ్రామ మండలస్థాయి అధికారులు, విఆర్ఓ శ్రీనివాసులు, గ్రామ కార్యదర్శి గౌతమి, భారీ సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## కోడిపందెరాయుళ్ళు నలుగురు అరెస్టు

నిమ్మనపల్లె, డిసెంబర్ 20 ప్రభాతవార్త :

మండలంలోని బండ్లపై పంచాయితీ బండమీదమాలపల్లె ఏరువంకలో సమీపంలో కోడిపందెం ఆడుతన్న ఈశ్వర్, పురారీస్, కుమార్, మేకల రెడ్డప్పలను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.2200లను స్వాధీనం చేసుకొన్నట్లు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబులు రమేష్ తెలిపారు.

## ప్రజలను రక్షించడానికి రెవెన్యూ సదస్సు

**టిడిపి ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి**




ములకలచెరువు, డిసెంబర్ 20 ప్రభాతవార్త :

భూ దోపిడి నుంచి ప్రజలను రక్షించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గూడుపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యతో బాధితులు ప్రభుత్వం చుట్టూ తిరగడం కాదు. ప్రభుత్వమే ప్రజ వద్దకు వెళ్ళి సమస్యలను పరిష్కరించే ఉద్దేశ్యంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో సమస్యలపై విన్నవించిన అర్జీలు వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్, రాష్ట్ర టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మెన్ కెవి.రమణ, మాజీ సర్పంచ్ ఎర్రగుడి సురేష్, సర్పంచ్ సంద్య జనార్ధన్‌రెడ్డి గూడుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు జి.నారాయణ, వెంకటరమణ, చంద్రమోహన్, మధు, కూటమి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ

కలికిరి, డిసెంబరు 20, ప్రభాతవార్త:



కలికిరి మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ట్రాన్స్ కో డీఈఈ శివయ్య, ట్రాన్స్ కో ఏఈ ముజీబర్ రెహామాన్ ఆధ్వర్యంలో విద్యుత్తు సిబ్బంది జాతీయ ఇంధన పొదుపుపై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఇంధన పొదుపు వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంధనం పొదుపుగా వాడుకోవాలని విద్యుత్తు సిబ్బంది నినాదాలు చేశారు. ర్యాలీలో అధిక సంఖ్యలో సిబ్బంది పాల్గొనడంతో ర్యాలీ విజయవంతమైంది.

## భూసమస్యల పరిష్కారానికే సదస్సులు



కురబలకోట, డిసెంబర్ 20 ప్రభాతవార్త :

అపరిష్కరింగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తంబళ్ళపల్లె టిడిపి ఇన్‌చార్జ్ దాసరపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కురబలకోట మండలం కనసానివారిపల్లె గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయాంలో నెలకొన్న భూ సమస్యలను రైతులు ఈ సదస్సులో అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సదస్సులో ప్రజలు నుంచి అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ సదస్సులో స్పెషల్ ఆఫీసర్ జయభారత్, తహశీల్దార్ తపస్వీని, ఎంపిడిఓ గంగయ్య, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, టిడిపి నాయకులు మండల కన్వీనర్ వైజి.సురేంద్ర, జంగా రాఘవరెడ్డి, రుద్రా బాలక్రిష్ణ, విఆర్ఓలు, సచివాలయ సిబ్బంది, సర్వేయర్ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## 22న మిట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కురబలకోట, డిసెంబర్ 20 ప్రభాతవార్త :

మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు ఈనెల 22న బెంగులూరులో సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. మిట్స్ అలుమ్నివేల్ఫేర్ అసోసియేషన్‌చే బెంగుళూరులోని దేవరబిసనహళ్ళి, బెల్లందూర్‌లోని ఐకాస్ ప్రీమియర్ హోటల్‌లో ఉదయం 10గంటలకు ఈ సమావేశంను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశానికి కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పాల్గొనవచ్చుని ఆయన తెలిపారు. ఈ సమావేశంకు పూర్వ విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు.

## కర్నాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

రామసముద్రం, డిసెంబర్ 20 ప్రభాతవార్త :



అక్రమమద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయితీ కమతంపల్లెకి శ్రీనివాసులు, చెంబకూరు రవి ఇద్దరు కర్నాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తలను ఎస్ఐ భీమలింగ అరెస్టు చేసి వారి నుంచి 25కర్నాటక టెట్రా ప్యాకెట్లు మద్యం సీజ్‌చేసి కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

## మేడికుర్తిలో రెవెన్యూ సదస్సు విజయవంతం



కలికిరి, డిసెంబరు 20, ప్రభాతవార్త:

మండలంలోని మేడికుర్తి పంచాయతీలో శుక్రవారం స్థానిక సర్పంచ్ నాగవేణి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సు విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి కలికిరి మండలం డిప్యూటీ తహసీల్దార్ నవీన్, కలికిరి మండలం నోడల్ ఆఫీసర్ జయప్రకాష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ పంచాయతీలలోని గ్రామాల ప్రజలు, రైతుల రెవెన్యూ సమస్యలు తెలుసుకొని వాటిని అక్కడికక్కడే పరిష్కరించేలా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయనపేర్కొన్నారు. ఈ సదస్సులో 51 రెవెన్యూ సమస్యలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ అర్జీలను ఆన్‌లైన్ చేయించి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జనార్ధన్‌గౌడ్, టీడీపీ సీనియర్ నాయకుల్సు సురేష్‌కుమార్‌రెడ్డి, కలికిరి మండలం నోడల్ ఆఫీసర్ జయప్రకాష్, సబ్ రిజిస్ట్రార్ అధికారిణి భువనేశ్వరి, అటవీశాఖాధికారులు, మేడికుర్తి పంచాయతీ కార్యదర్శి మయూరి, ఏఎస్పై మధుసూదనాచారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు తనిఖీ



కమలాపురం, డిసెంబరు 20, ప్రభాతవార్త:

ఎరువుల దుకాణాలను శుక్రవారం కడప సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్ నాయక్ కమలలాపురం, వల్లూరు మండలాలలో ఎరువులు దుకాణాలు శుక్రవారం తనిఖీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎరువులు దుకాణాదారులు చట్టంకు లోబడి వ్యాపారం చేయాల్సిందిగా డీలర్లకు తెలిపారు. యూరియా ఎంఆర్‌పీ ధరకే అమ్మాలని స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్, స్టాక్ బోర్డు అందరూ తప్పనిసరిగా షాప్ నందు ఉంచుకోవాలి. అలాగే స్టాక్ రిజిస్టర్‌కు ఎరువుల నిల్వలకు వ్యత్యాసం లేకుండా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.సరస్వతి, సాయిజ్యోతి, వ్యవసాయ విస్తరణాధికారి దస్తగిరి, కమలాపురం, వల్లూరు మండలాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

చాపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త:

భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమా కుమారి తెలిపారు. మండలంలోని చియ్యపాడు గ్రామం నందు శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ పరిధిలో వివిధ భూముల ససమ్యలకు సంబంధించి 44ఫిర్యాదుల అర్జీ రూపంలో వచ్చినట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తాసిల్దార్ కృష్ణారెడ్డి, సర్పంచ్ వెంకట శివప్రసాద్, రీ సర్వే డిప్యూటి తహసీల్దార్ నారాయణ స్వామి, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ శివశంకర్ రెడ్డి, వీఆర్వో పురుషోత్తం, పంచాయతీ కార్యదర్శి ముల్లంగి సుధాకర్, నాయకులు వెంకటరమణా రెడ్డి, నారాయణ రెడ్డి, తప్పేట హరిబాబు, రైతులు పాల్గొన్నారు.



## మారెమ్మకు ప్రత్యేక పూజలు

రామసముద్రం, డిసెంబర్ 20 ప్రభాతవార్త :

రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయితీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో ఉన్న గ్రామ దేవత మారెమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పలురకాల పుష్పాలతో అలంకరణ చేసి అమ్మవారికి పొంగల్ సమర్పించి మారెమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకొన్నారు.



## డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన

పెండ్లిమర్రి, డిసెంబరు 20, ప్రభాతవార్త:



మండలంలోని వెల్లటూరు గ్రామంలో శుక్రవారం కేంద్ర మంత్రి డా.జితేందర్‌సింగ్ పర్యటనలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్ నాయక్, ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డిలు డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన మరియు పంటల సాగు గురించి మరియు మినుము, చామంతి, వేరుశనగ, మామిడి పంటలను పరిశీలించి తగు సూచనలు ఇవ్వడం జరిగింది. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీ చేసి మంత్రి పర్యటన ఏర్పాట్లను తొందరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠారెడ్డి మరియు వ్యవసాయాధికారులు జి.పి.ఓబులేసు, ఈశ్వర్‌రెడ్డి, ఉద్యానవనశాఖాధికారులు రెడ్డయ్య, జ్యోతిర్మయి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, ఈఓఆర్డీ ఇన్‌ఛార్జి గంగులయ్య, ఎంపీఈవో ప్రేమానంద్, రైతులు పాల్గొన్నారు.

## బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు భూమి పూజ

పెండ్లిమర్రి, డిసెంబరు 20, ప్రభాతవార్త:



మండలం గంగనపల్లి గ్రామం శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థానం పొలతలలో గౌరవ కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణచైతన్యరెడ్డి చొరవతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పొలతల దేవస్థానంలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ అధికారులు, ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణనాయక్, టీడీపీ నాయకులు శిరిగి రాజారెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## హోం మంత్రి వ్యాఖ్యలకు నిరసన

దువ్వూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త:



డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం స్థానిక తెలుగు గంగా బంగ్లాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సంధర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన అంబేద్కర్‌ను వివిధ రకాల మాటలు అనడం శోచనీయం అన్నారు. ఈ సంధర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు జయరాం, అజయ్‌బాబు, బేబి, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామ

దువ్వూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త:

మండల పరిధిలోని జిల్లెల్ల, బుక్కాయ పల్లె గ్రామాలకు చెందిన గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ ఇద్దరిపై ఫిర్యాదులు రావడంతో స్వచ్చందంగా రాజీనామా చేసినట్లు తెలిసింది. బుక్కాయపల్లెకు చెందిన వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లెల్లకు చెందిన ప్రసన్నకుమార్ రెడ్డిలు తమ విధుల నుంచి స్వమంగా వైదొలిగారు. వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఉపాధి హామీ పథకంలో 25రోజులు పనిచేసి ఉండాలని, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ ధరఖాస్తులను ఉపాధి హామీ పథకం కార్యాలయంలో అందజేయాలని అన్నారు.

## దుంపలగట్టులో దొంగతనాలు

ఖాజీపేట, డిసెంబర్ 20, ప్రభాతవార్త:



ఖాజీపేట మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామంలో దొంగలు గురువారం నాడు రాత్రి విజృంభించారు. దుంపల గట్టు గ్రామంలో గ్రామానికి చెందిన రెడ్డం చంద్రశేఖర్ రెడ్డి మరియు సుధాకర్ రెడ్డి అనే వేరువేరు కుటుంబాల వ్యక్తుల ఇళ్లలో దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. బాధితులు కొత్తగా నిర్మించిన గుడి దగ్గర భజన చేసి పదకొండు గంటల సమయాన ఇంటికి వచ్చి పడుకున్నారు. అదును చూసిన దొంగలు ఇండ్ల సుధాకర్ రెడ్డి ఇంటిలోనికి పక్కన ఉన్న కిటికి గుండా లోనికి ప్రవేశించి పడుకొని ఉన్నా సుధాకర్ రెడ్డిని, అతని భార్యను దాటుకొని బెడ్ రూంలోకి వెళ్లి అక్కడ దాచిన 20గ్రాముల బంగారు, 20వేల రూపాయల నగదును చోరీ చేశారు. అలాగే రెడ్డెం చంద్రశేఖర్ రెడ్డి ఇంటిలోనికి ప్రవేశించారు. ఆ సమయంలో వారు ఇంటిపైన నిద్రిస్తూ ఉన్నారు. అదే అదునుగా భావించిన దొంగలు వారి ఇంటిలో 148గ్రామాలు బంగారు, నాలుగు లక్షల ఇరవై వేల రూపాయల నగదును చోరీ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖాజీపేట సీఐ మోహన్ తెలిపారు. త్వరితగతిన దొంగలను కనుగొని సాధ్యమైనంత తొందరగా సొత్తును రికవరీ చేయాలని బాధిత కుటుంబాలు విలపిస్తున్నారు.

## ప్రతి రైతు సమస్య పరిష్కారం చేస్తాం

సిద్దవటం, డిసెంబరు 20, ప్రభాతవార్త:



భూ సమస్యలపై అర్జీ సమర్పించిన ప్రతి రైతు సమస్య పరిష్కారమే రెవెన్యూ సదస్సు కార్యక్రమం అని ఇన్‌ఛార్జి మండల తహసీల్దార్ మాధవీలత అన్నారు. సిద్దవటం మండలంలోని కనుమలోపల్లి రెవెన్యూ ఎంపీపీ స్కూలులో శుక్రవారం రెవెన్యూ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేసిన ప్రతి రైతు సమస్య పరిష్కారం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె రైతుకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సుదర్శన్, వీఆర్ఓ శ్యాంబాబు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

సిద్దవటం, డిసెంబరు 20, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం రైతుల, పాడి పరిశ్రమకు అండగా ఉంటుందని రుజువైందని రాజంపేట నియోజకవర్గం తెదేపా ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. సిద్దవటం మండలంలోని మాధవరం-1 గ్రామం, బంగారుపేటలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గుండ్ల, పెద్ద సుబ్బరాయుడు రూ.2.30లక్షల వ్యయంతో గోకుల షెడ్డు నిర్మించారు. శుక్రవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాలసుబ్రమణ్యం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న పాడి రైతులు ఇటువంటలి గోకుల షెడ్డు నిర్మాణానికి అర్హులైన వారికి అందరికి అందిస్తామని ఈ కార్యక్రమంలో తెదేపా ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, కాడే చెంచయ్య నాయుడు, రామ్మోహన్ నాయుడు, పార్లమెంటు కార్యదర్శి నాగముని రెడ్డి, సుధా మురళీ, తెదేపా నేతలు తదితరులు పాల్గొన్నారు.

## పేరు మార్పు

MADISETTY PAVAN KUMAR తండ్రి. MADISHETTY NARASIHMULU (పాత పేరు) ఇంటి నెం: 4/14621521 హనుమాన్ నగర్, ప్రొద్దుటూరు టౌన్ మరియు (మం) వై.ఎస్.ఆర్ జిల్లా., ఏ.పీ., మా పేరు MADISETTY PAVAN KUMAR తండ్రి MADISHETTY NARASIHMULU (క్రొత్తపేరు) గా మారినది. నేటి నుండి MADISHETTY PAVAN KUMAR అని గమనించగలరు.

# రెవిన్యూ సదస్సులో అర్జీలు వెల్లువ....



పీలేరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త ః

గత ప్రభుత్వ హయాంలో భూముల తగరాదులు కారణంగా వాటి పరిష్కారానికి కార్యాలయాలు చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయిన రైతులకు ఈ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఇందు కోసం రాష్ట్రవ్యాప్తంగా గ్రామ గ్రామాన రెవెన్యూ సదస్సులను నిర్వహించి రెవెన్యూ యంత్రాంగాన్ని ప్రజల వద్దకు తీసుకొచ్చింది. గతంలో మాదిరి కాకుండా అర్జీలు పెట్టిన 45 రోజుల్లోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనేది లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం ఈ సదస్సులను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా పీలేరు మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో రైతులు ప్రజల నుంచి అర్జీలు వెలువెత్తుతున్నాయి. వీటిలో సింహభాగం మ్యుటేషన్, పేరు మార్పు కోసం చేసుకున్న అర్జీలే అధికంగా ఉన్నాయి. వీటికి తోడు రైతులు తమ తమ పొలాలకు దారి సమస్య ఉందని, బాగా పరిష్కారం చేసుకున్నా కూడా భూమి అంతా ఒకరి పేరు ఉందని రైతుల నుంచి అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. వీటికి తోడు వివిధ రకాల రెవిన్యూ సమస్యలు కూడా తోడవడంతో రైతులకు వారి వారి అనుభవంలో ఉన్న భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారే అధికంగా అర్జీల రూపంలో తమ సమస్యను అధికారులకు విన్నవిస్తున్నారు. మొట్టమొదటిసారిగా పీలేరు మండలం మేళ్లచెరువు గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సరస్సులో న్యూ మూటిషన్ సమస్యకు పరిష్కారం కోసం 50 దరఖాస్తులు వచ్చాయంటే పరిస్థితి అర్థం అవుతుంది. భూముల పేరు మార్పు జోలికి పోనీ అధికారులు ఒక గ్రామ సభలోని 50 మంది తమ భూమిపై పేరు మార్చుకోవడానికి అర్జీలు ఇచ్చారంటే పీలేరు మండలంలో ఈ తరహా అర్జీలు ఏ స్థాయిలో పెండింగ్లో ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది. ఈ మూటేషన్ పెండింగ్లో ఉండడంతో ప్రభుత్వం నుంచి వస్తున్న రాయితీలు పథకాలు రుణాలు తదితర సౌకర్యాలు రైతులు పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. తన ఆధీనంలో ఉన్న భూమిలో సాగుచేసి పంట నష్టపోయిన సాగుచేసిన రైతుకు నష్టపరిహారం అందకుండా ఎవరి పేరు భూమి నమోదై ఉందో వారికే పరిహారం అంటోంది. నిజమైన రైతుకు భూమిపై ఉండి సాగు చేస్తున్న రైతులకు న్యాయం జరగలేదు. ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా నిర్వహిస్తున్న ఈ రెవెన్యూ సదస్సులు అర్జీలు తీసుకోవడానికి పరిమితమవుతున్నాయని. పీలేరు మండల పరిధిలో ఒక పంచాయతీలో పేరు మార్పు కోసం 50 దరఖాస్తులు వచ్చాయంటే మండల వ్యాప్తంగా 750 దరఖాస్తులు వచ్చినట్టు లెక్క. పలుమార్లు అర్జీలు పెట్టుకున్నా కూడా పేరు మార్పునకు అధికారులు చర్యలు తీసుకోలేదని రైతులు బాహాటంగా ఆవేదన వెళ్లగకుతున్నారు. ఇదే విషయమై పీలేరు తహసిల్దార్ భీమేశ్వరరావు మాట్లాడుతూ అనుభవంలో ఉన్న భూమికి పేరు మార్చుకోవడానికి ముందుగా భాగ పరిష్కారం చేసుకోవాల్సి ఉంటుంది అన్నారు. ఇలాంటి భూముల పై వచ్చిన దరఖాస్తులను తొందరగా పరిష్కారం అవుతున్నాయని, కోర్టు వివాదాలు ఇతరత్రా కేసులు ఉన్న భూములు పై పేరు మార్పు పెండింగ్ లో ఉన్నాయని ఆయన అన్నారు. రికార్డులన్నీ సక్రమంగా ఉంటే వెంటనే గడువు లోపు పేరు మార్పు చేస్తున్నామని తహసిల్దార్ స్పష్టం చేశారు.

## 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### ఐదు మంది నిందితుల అరెస్ట్

రాజంపేట అర్బన్, డిసెంబర్ 20 ప్రభాతవార్త



రాజంపేట ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని రాజంపేట రేంజ్‌లో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న ఐదు మందిని అరెస్ట్ చేసి 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు డి.ఎస్.పి నాంపల్లి సుధాకర్ వెల్లడించారు. శుక్రవారం రాజంపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టారు. పుల్లంపేట మండలంలోని అనంతసముద్రం పరిసర ప్రాంతాల్లో స్మగ్లింగ్‌కు సిద్ధం చేసినట్లు సమాచారం అందడంతో దాడులు నిర్మించామన్నారు. ఈ సందర్భంగా ఐదు మంది నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 15 దుంగలతో పాటు రెండు మోటార్ బైకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో రాజంపేట రూరల్ సీఐ రమణ, పుల్లంపేట ఎస్సై మోహన్ కుమార్ గౌడ్, నందలూరు ఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అన్నమయ్య, హనుమంతుని విగ్రహాల ఏర్పాటు చేయాలి

లక్కిరెడ్డిపల్లి: డిసెంబర్ 20 ప్రభాతవార్త



తిరుమల తిరుపతి దేవస్థానములు శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో గతంలో కూల్చివేసిన అన్నమయ్య ఇల్లును ప్రస్తుతం పునః ప్రతిష్టించి, అన్నమయ్య విగ్రహం, హనుమంతుని విగ్రహం ఏర్పాటు చేయాలని తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం అన్నమయ్య జిల్లా నాయకులు రంగస్థల కళాకారుడు తుమ్మల హరినాథ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లిలోని శ్రీకృష్ణదేవాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తిరుమలలో నిత్యం జరుగుతున్న హరినామ సంకీర్తనలకు అనుమతినిచ్చిన విధంగా రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలలోనూ, తిరుపతిలోని ప్రముఖ అనుబంధ దేవాలయాలలో కూడా అఖండ హరినామ సంకీర్తనలు గానం చేసే విధంగా భజన బృందాలకు అనుమతినివ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రముఖ దేవాలయాలలో భజన చేసిన బృందాలకు రానుపోను చార్జీలు అందించాలని, వసతిని కల్పించాలని, భజన నేర్పే గురువులకు ప్రతినెలా గౌరవ వేతనం 10వేలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కళాకారులు హార్మోనిస్ట్ మహాదేవ, బాబు, రాము, భజన గురువులు ఆదినారాయణ, రామానుజులు, భాస్కర, జలంధర్, నారాయణమ్మ, చంద్రకళ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## మానవత సంస్థకు దాత రూ.5116 విరాళం

పీలేరు డిసెంబర్ 20 ప్రభాతవార్త ః



పీలేరు పట్టణం అయ్యప్పరెడ్డి కాలనీకి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రాచపల్లె రాజగోపాల్ రెడ్డి దంపతులు శుక్రవారం తన తల్లిదండ్రులు సిద్ధారెడ్డి రామసుబ్బమ్మ వర్ధంతి సందర్బంగా మానవత సంస్థకు రూ.5116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ పీలేరుకు చెందిన మానవత సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయాన్ని ఇస్తున్నట్లు చెప్పారు. తమ విరాళాన్ని చెక్కు రూపంలో మానవత సంస్థ నిర్వాహకులు వంగిమళ్ల రామచంద్ర, శెట్టి సుబ్రమణ్యం, వైవి రమణ, కృష్ణమూర్తి, పొతంశెట్టి రమేష్‌లకు అందించారు. దీంతో తమ సంస్థకు విరాళమిచ్చిన దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యవసాయ పెట్టుబడికి ప్రభుత్వం కసరత్తు



పీలేరు డిసెంబర్ 20 ప్రభాతవార్త ః

పీలేరు నియోజకవర్గ స్థాయిలో తమ గ్రామ, పట్టణ శివారుల్లో చెరువుల కింద భూములున్న రైతులు సాగునీటి సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన వారందరూ, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డికు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రైతులు వ్యవసాయం చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు భూమి ఉన్న రైతులకు ప్రతి సంవత్సరం 20,000 వేలు చొప్పున ఐదేళ్ల గాను లక్ష రూపాయలు వ్యవసాయ పెట్టుబడి సహాయం అందించడానికి చర్యలు తీసుకుంటూ కూటమి ప్రభుత్వం కసరత్తు చేపట్టిందన్నారు. మేము ఎమ్మెల్యేలుగా ఈ స్థానంలో ఉన్నామంటే ప్రజలు రైతులు కార్యకర్తలు అభిమానులు వారి గొప్పతనమేనన్నారు.

## ఘనంగా బాస్ ఆవిర్భావ దినోత్సవం

పీలేరు డిసెంబర్ 20 ప్రభాతవార్త ః



భారతీయ అంబేద్కర్ సేన 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పీలేరులో అట్టహాసంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ కూడలిలో ఈ వార్షికోత్సవ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం బాస్ జెండాను ఆవిష్కరించి, భాస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భారత సమాజాన్ని సశాస్త్రీయమైన సమాజంగా రూపొందించడానికి వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న సామాజిక న్యాయ పోరాట ప్రస్థానానికి కొనసాగింపుగా 2012 వ సంవత్సరం డిసెంబర్ 20న భారతీయ అంబేద్కర్ సేనను పిటిఎం శివప్రసాద్ స్థాపించారని అన్నారు. అనేక సందర్భాల్లో ఎస్సీ, ఎస్టీలపై జరిగే అట్రాసిటీ కేసుల్లో బాధిత కుటుంబాలకు రక్షణ కవచంగా భారతీయ అంబేద్కర్ సేన నిలిచిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బాస్ జిల్లా నాయకులు ముల్లంగి కృష్ణయ్య, ఆరుమడకల నాగరాజ, నాయకులు నాగేశ్వరరావు, పల్లె పోగు హరినాధ, ఎర్రబల్లి మల్లికార్జున, ముల్లంగి గురవయ్య, రామకృష్ణ, రాంబాబు, శివకుమార్ పాల్గొన్నారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

యర్రగుంట్ల డిసెంబర్ 20 ప్రభాతవార్త



మండల పరిధిలోని తిప్పలూరు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో వెంకటరమణయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో జరుగుతున్న వివిధ అంశాలపై అక్కడి గ్రామ కార్యదర్శితో అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్, రికార్డు ఎంఎస్ఎం ఈ, మిస్సింగ్ సర్వేలపై ఆరా తీశారు. తర్వాత సిబ్బంది బయోమెట్రిక్ విధానంపై కూడా ఆయన ఆరాదిశారు. అక్కడ ఉన్న సిబ్బందికి పలు రకాల సూచనలు సలహాలు అందించారు.

## ఎమ్మెల్యే వరద తీరు విడ్డూరం

ప్రొద్దుటూరు డిసెంబర్ 20 ప్రభాతవార్త




నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి అనుమతితో వచ్చిన అధికారులపై ఆరు నెలలకే బురద చల్లడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే వరద తీరుపై మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి విస్మయం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో అవినీతి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తమపై విమర్శలు చేసిన సంగతిని గుర్తు చేశారు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలల కాలంలో ప్రొద్దుటూరులో అవినీతి అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోయాయని విమర్శించారు. నియోజకవర్గంలో అవినీతి చేసే అధికారులపై సహించబోనని చెప్పిన ఎమ్మెల్యే ప్రస్తుతం జరుగుతున్న అవినీతి కనపడలేదా అని ప్రశ్నించారు. బియ్యం మాఫియా పై చర్యలు తీసుకుంటామని, బ్రాందీ షాపులలో ప్రభుత్వం నిబంధనల అతిక్రమిస్తే ఊరుకోనన్న వ్యాఖ్యలను మానుకుంటే మంచిదన్నారు. బైక్ ఏమో నీతి వాక్యలు చెబుతూ మొత్తం టిడిపి నాయకుల అవినీతి పై మాట్లాడకపోవడం ఏమిటని ప్రశ్నించారు బ్రాందీ షాపులలో కూటమి నాయకులే ఒకరు తాపమంటే మరొకరు అడ్డుపడుతున్నారని విమర్శించారు. ప్రతి శాఖలో ఆర్టిఐ ఆక్టివ్ పెట్టి సమస్యలు సృష్టించేది టిడిపినే తిరిగి పరిష్కరించేది మీరే అని ఎద్దేవా చేశారు. దీనివల్ల ప్రొద్దుటూరులో అభివృద్ధి నిలిచిపోయిందని విమర్శించారు. నియోజకవర్గంలో అవినీతిని కూకట్వేలతో తెగించి వేస్తానన్న ఎమ్మెల్యే వరద నియోజకవర్గంలో అవినీతి పెరిగిపోయిందని చెప్పడం దారుణం అన్నారు. అధికార పక్ష నాయకుల తీరును ప్రజలు గమనించాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి యువ నాయకులు ద్వార్శల గురునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యాన్మయ శక్తిగా అవతరిస్తాం

పీలేరు డిసెంబర్ 20 ప్రభాతవార్త ః

మాలమహానాడు ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చిత్తూరు జిల్లా జడ్పీ కో ఆప్షన్ సభ్యులు షామియానా షఫీ స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం కళ్ళగంతలతో ప్రజాసంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేసారు నిరసనను ఉద్దేశించి మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ మనువాదులు బ్రాహ్మణ భావజాలానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎప్పటికీ కూడా ఈ దేశంలో ప్రత్యామయ శక్తిగా నిలుస్తాడని అన్నారు దేశంలో మూడు వేల సంవత్సరాల నుండి ఏదో ఒక రూపంలో మనువాద, బ్రాహ్మణ భావజాలమే రాజ్యమేలుతుందని భారత దేశంలో హోం శాఖ మంత్రి పార్లమెంటు సభలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ గారిని అనుచిత వాక్యాలుచేసి అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలని అతను తన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున కలిసొచ్చేటువంటి శక్తులన్నిటిని కలుపుకొని పెద్ద ఎత్తున పోరాడుతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మాలమహానాడు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, పీలేరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్, జాస్ స్టేట్ లీగల్ అడ్వైజర్ గుండ్లూరు సదశివా, జిల్లా మహిళా అధ్యక్షులు గుండ్లూరు రాజేశ్వరి, బంజారా సేవా సంఘం పీలేరు నియోజకవర్గ ఇంచార్జి బుక్కే హరి నాయక్ డి. బి. ఎస్. యఫ్. అధ్యక్షులు బద్దె భాను ప్రకాష్, బాస్ జిల్లా నాయకులు ముల్లంగి క్రిష్ణయ్య దప్పేపల్లి ఆనంద్, కార్యదర్శి మద్దెల బాల గంగాధర్, తుమ్మల రవిచంద్ర, దప్పేపల్లి సురేంద్ర, అవసాని సురేంద్ర, భారతీయ అంబేడ్కర్ సేన నాయకులు ముల్లంగి గురునాధ, మాణిగుంటి, నాగేశ్వరావు, శ్రీనివాసులు, ద్వారకా, తదితరులు పాల్గొన్నారు



## ఐక్యంగా ఉంటే దేనినైనా సాధించవచ్చు



రాజంపేట, డిసెంబర్,20, ప్రభాతవార్త

రాష్ట్ర ఉద్యోగులు అందరూ ఐక్యంగా ఉంటే దేనినైనా సాధించవచ్చునని ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి తెలిపారు. శుక్రవారం రాజంపేటలో నూతనంగా నిర్మించిన నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల సంఘం భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎన్జీవో సంఘం నాయకులు ఉద్యోగులు ఐక్యంగా ఉండటం వల్లే ఈరోజు ఇంత పెద్ద భవనాన్ని రాజకీయ నాయకులకు సంబంధం లేకుండా ఇక్కడ నిర్మించగలిగారని తెలిపారు. గతంలో ఉన్న భవనం శిథిలా వస్తకు చేరడంతో దానిని తొలగించి నూతన కాంప్లెక్స్ ను నిర్మించడం చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. ప్రతి మండలంలో ఇదేవిధంగా ఉద్యోగులందరూ ఐక్యతగా ఉండి ఇలాంటి భవనాలను నిర్మించుకుంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వి శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తమ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ వై ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి. రవికుమార్, రాజంపేట తాలూకా అధ్యక్షుడు ఎస్ వెంకటరమణ, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ ఓవి శివారెడ్డి, ట్రెజరర్ ఎం వరదయ్య, రాజంపేట తాలూకా ఎన్జీవో వైస్ ప్రెసిడెంట్‌లు ఎస్ రామానుజులు కే కిరణ్ ఎం హరిప్రసాద్‌బాబు బి శ్రీనివాసరాజు జాయింట్ సెక్రటరీలు వైఎంవి విజయకుమారి, పి సుబ్బరాయుడు, పి వెంకటేష్, మహేష్ మోడీ, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటసుబ్బయ్యలతోపాటు రాజంపేట ప్రాంతంలోని ఏపీ ఎన్జీవో ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తను ఆదుకుంటాం: ఎంపీపీ



సుండుపల్లి, డిసెంబర్20,ప్రభాతవార్త:

ప్రతి కార్యకర్తకు అండగా నిలబడి వారి అవసరాల తీర్చే దిశగా ప్రయత్నిస్తామని మండల ఎంపిపి రాజమ్మ అన్నారు శుక్రవారం ఆమె పంబాల రమణ అనే దివ్యాంగుడికి మూడు చక్రాల బండిని పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామముకు చెందిన కంబాల రమణ చెక్కర వ్యాధితో చాలాకాలం నుండి బాధపడుతు ఎడమకాలు తీసివేయడం జరిగిందని ఈ విషయం తన దృష్టికి రావడంతో ప్రభుత్వంతో మాట్లాడి మూడు చక్రాల వాహనం ఇప్పించడం జరిగిందని తెలిపారు. మండలంలో ఏ ఒక్క కార్యకర్త అధైర్య పడాల్సిన అవసరం లేదని అలాగే ఏ ఒక్క కార్యకర్త ఇబ్బంది పడకుండా వారు ఇబ్బందులను తమ దృష్టికి తెస్తే ప్రభుత్వానికి నివేదికలు పంపి వారిని అన్ని విధాల ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ గిరిజన విభాగం ఉపాధ్యక్షుడు ఆనంద్ నాయక్, జనసేన నాయకుడు రామా శ్రీనివాస్, శివ, మోహన్ రెడ్డి, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోస్టుఆఫీస్ సిబ్బందికి సన్మానం

సుండుపల్లి, డిసెంబర్ 20,ప్రభాతవార్త:



మండలంలోని పోస్ట్ఆఫీస్ నందు పనిచేయుచున్న మునిరత్నం, భాస్కర్, రెడ్డిశేఖర్‌లు ఢిల్లీ పోస్టల్ సర్కిల్‌కు పదోన్నతిపై వెళుతున్న సందర్భంగా రాకెట్ పోస్టల్ ఇన్స్పెక్టర్ కే అమర్నాథ్ వీరికి శుక్రవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తమ విధి నిర్వహణలో మంచి విలువలు పాటించి పదోన్నతులు పొందడం హర్షనీయమన్నారు వీరింగా జీవితంలో మంచి పదవులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లి పోస్టుమాస్టర్ సురేష్ పోస్టల్ యూనియన్ నాయకులు సుబ్రమణ్యం, తిమ్మసముద్రం బిపిఎమ్ రామకృష్ణ సుండుపల్లి పరిదిలోని అందరు పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరు పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అండ



వాల్మీకిపురం, డిసెంబర్ 20 ప్రభాతవార్త ః

రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని చింతల వారిపల్లె చెందిన నిరుపేద పెయింటర్ జహరుద్దీన్ బాషా ఇటీవల రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచాన పడ్డాడు. గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో మెరుగైన వైద్యసేవలకు దూరమయ్యాడు ఈ నేపథ్యంలో జహరుద్దీను మెరుగైన వైద్యం అందిండానికి పీలేరు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.3.34లక్షల నగదును మంజూరు చేయించారు మంజూరైన నగదు చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే బాధితుడికి నగదు చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిరుపేదలకు ప్రయోజనకరంగా ప్రజాపాలన అందిస్తుందన్నారు రైతులకు, మహిళలకు, యువతకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెదేపానాయకులు కంభం నిరంజన్నెడ్డి, ద్వారకనాథరెడ్డి, శేషురెడ్డి, కోసూరి చంద్రమోళి, కెవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక బోధనను సద్వినియోగం చేసుకోవాలి



వాల్మీకిపురం, డిసెంబర్ 20 ప్రభాతవార్త ః

స్థానిక ప్రభుత్వ పీవీసీ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యలో వెనకబడిన విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే స్టడీ మెటీరియల్ తో పాటు నిత్యం సాయంత్రం అందించే బోధన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి అన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు ప్రతి సాయంత్రం ఉచితంగా స్నాక్సు అందించే కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులకు ఈ స్టడీమెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని, గ్రామీణ విద్యార్థులకు స్టడీమెటీరియల్ తో పాటు కళాశాలలో సాయంత్రం నిర్వహించే బోధన తరగతులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను ధ్వంసం చేసింది

అట్లూరు డిసెంబర్ 20 ప్రభాతవార్త :



వైసీపీ ప్రభుత్వం మీద ఎన్నో ఆశలు పెట్టుకుని ప్రజలు గెలిపిస్తే వారి ఆశలు వమ్ము చేస్తూ అన్ని వ్యవస్థలను ధ్వంసం చేసిందని బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ప్రజా నాయకుడు మంచూరు సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో పాల్గొని మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే రాజధాని నిర్మాణానికి అన్ని వనరులను మనం సమకూర్చుకున్నాం అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని బాగు చేయాలనే ఉద్దేశంతో ఒక కంకణం కట్టుకొని పనిచేస్తున్నామని గడిచిన ఐదేళ్లలో రాజకీయ కక్షలు కార్పన్యాలతోనే గడిచిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమం రెండిటిని సమానంగా ముందుకు తీసుకెళుతున్నాం అన్నారు .

## డైరెక్టర్‌ను సన్మానించిన యల్లటూరు

రాజంపేట, డిసెంబర్ 20, ప్రభాతవార్త



రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ పొన్న యుగంధర్ ను రాజంపేట పార్లమెంట్ జన సేనపార్టీ సమన్వయకర్త యల్ల టూరు శ్రీనివాసరాజు శుక్రవారం తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా యల్లటూరు మాట్లాడుతూ పొన్న యుగంధర్ ఉమ్మడి చిత్తూరు జిల్లా, గంగాధర్ నెల్లూరు నీయోజక వర్గం జనసేన పార్టీ ఇన్చార్జి గా ఉంటూ ఇటీవల కూటమి ప్రభుత్వం ఇచ్చిన నామినేటెడ్ పదవులలో ఈయనకు మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులు అయ్యారన్నారు. ఇందులో భాగంగా మొట్టమొదటిసారిగా అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు జనసేన పార్టీ కార్యాలయానికిరావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## ఆర్టిఐ జిల్లా అధ్యక్షులుగా వెల్లాల

కడప కార్పొరేషన్ డిసెంబర్ 20 ప్రభాతవార్త:



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాలైన సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షునిగా ప్రముఖ న్యాయవాది, వెల్లాల రామకృష్ణారెడ్డిని నియమితులయ్యారు. శుక్రవారం కడపలో మీడియాతో వారు మాట్లాడుతూ వైయస్సార్సీపి పార్టీకి చేసిన సేవలను గుర్తించి నమ్మకంతో ఈ పదవిలో నన్ను నియమించినందుకు వైఎస్ఆర్సిపి జాతీయ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథ్ రెడ్డికి, కడప ఎంపీ అవినాష్ రెడ్డికి, మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషాకి, నగరం మేయర్ సురేష్ బాబుకు, కార్పొరేటర్ల అందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అలాగే మమ్మల్ని గుర్తించి పదవి ఇచ్చినందుకు ఎల్లవేళల తమవంతు కృషి చేస్తామని 44వ డివిజన్ కార్పొరేటర్ వెల్లాల హేమలత డివిజన్ ఇంచార్జ్, ప్రముఖ న్యాయవాది వెల్లాల రామకృష్ణారెడ్డి తెలిపారు.

## రాజీనామాకు సిద్ధమా

ప్రొద్దుటూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త




కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అవినీతిని ఆధారాలతో నిరూపిస్తే నంద్యాల వరదరాజు రెడ్డి సర్పంచును రాజీనామా చేయించేందుకు సిద్ధమా అని మున్సిపల్ వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్ అవినీతిపై విరుచుకపడ్డారు. కేవలం నివాసాలు లేకపోయినా డబ్బులు ముట్టచెబితే చాలు రోడ్లు నిర్మాణం చేపడుతున్నారని ఎద్దేవా చేశారు. కెవిఆర్ కాలనీలో ఆయనకు ముడుపులు ముట్టిన చోట కేవలం 3 ఇళ్ళు వున్నా రోడ్ల నిర్మాణం చేపట్టారని వివరించారు. టెండర్ల విషయంలోనూ ఆయన అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. తాను కొత్తపల్లి పంచాయతీ సర్పంచ్ అవినీతిని నిరూపిస్తే ఆయన రాజీనామా చేయాలని, నిరూపించని పక్షంలో తాను కౌన్సిలర్, వైస్ ఛైర్మన్ పదవులకు రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పేరం సునీత, నాయకులు లక్ష్మినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోఆపరేటివ్ సొసైటీకి పనులు కేటాయించండి

ప్రొద్దుటూరు డిసెంబర్ 20 ప్రభాతవార్త



పట్టణానికి చెందిన ఆదర్శ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటివ్ సొసైటీకి మున్సిపల్ అభివృద్ధి పనులు కేటాయించాలని సొసైటీ ప్రెసిడెంట్ సుబ్బన్న మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కలిసి వినతిపత్రం అందజేశారు. మాకు జీవనాధారమైన ఈ సొసైటీకి మున్సిపల్ పనులను కేటాయించి మాకు పనులు కల్పించి మమ్మల్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, తలారి రమేష్ కౌన్సిలర్ కమాల్ భాష టిడిపి నాయకులు కాచన శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలు చేయడం మహా పుణ్యకార్యం

యర్రగుంట్ల డిసెంబర్ 20 ప్రభాతవార్త



తిప్పలూరు గ్రామంలో ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమంలో ఆరు నెలల నుంచి అనాధ ఆశ్రమంలో ఉంటూ జీవనం కొనసాగిస్తూ ఉండేవాడు. ఈ వృద్ధుడు సుబ్బరాయుడు రాజంపేట చెందినవ్యక్తి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని ఆశ్రమం నిర్వాహకుడు నాగేంద్ర అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌కు డాక్టర్ ఎన్ విజయ బాబుకు తెలుపగా అక్కడికి వెళ్లి సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎన్ విజయ్‌బాబు, నాగేంద్ర ఈ సందర్భంగా మాట్లాడుతూ అనాధలను అభాగ్యులను ఆదరించడం అన్నం పెట్టడం, అంత్యక్రియలు చేయటం మహా పుణ్యకార్యం అన్నారు, అలాగే ఎవరు లేకుండా మరణించిన వారికి మేమున్నామంటూ అనాధగా కాకుండా సంప్రదాయపద్ధంగా అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని అన్నారు, ఎన్ని కష్టాలొచ్చినా ఎదుర్కొంటూ మానవత్వం కలిగిన మాకు దైవానుగ్రహంతోనే కార్యక్రమాలన్నీ ట్రస్ట్ ద్వారా చేస్తున్నామని తెలిపారు, ఈ కార్యక్రమంలో సురేంద్ర, పుల్లయ్య ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని ఫోటో ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త

మున్సిపల్ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో ఏర్పాటు చేయాలని బిజెపి పట్టణాధ్యక్షులు వంకదార నరేంద్ర రావు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ నరేంద్ర మోడీ చిత్రపటాన్ని కార్యాలయంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా కోశాధికారి వంకదార జయలక్ష్మి, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఎన్ కుమారి, రవితేజ, విక్రమ్, గంగిరెడ్డి, సిద్ధార్థ, గౌస్, కార్యదర్శి సుంకు గురు ప్రసాద్, నాగరాజు శర్మ, ప్రశాంత్ భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



